"ఆడపిల్లలంటే మీ కెందుకు భయం" ఆసక్తిగా, చొరవగా అడిగింది వనిత. ఆమె అడిగిన తీరు రమణకు ధైర్యం కలిగించింది.

"ఇప్పుడవన్నీ ఎందుకు? ఓ చిన్న పాట పాడరాదూ. రోజు నిద్రపోయేముందు పాటలు వినటం నాకు అలవాటు" అన్నాడు భయ భయంగా. సిగ్గుపడిపోయింది వనిత.

"ఆవేళ పెళ్ళిచూపుల్లో నువ్వు పాడిన పాట చాలా బాగుంది. అచ్చం సినిమాల్లోలా పాడావు. నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటె సినిమాలంటే నాకు ప్రాణం. బాగా పాటలు పాడగల అమ్మాయినే చేసుకోవాలనుకున్నాను. నా కోరిక తీరింది. ఒక పాట పాడవు... ప్లీజ్" బ్రతిమాలుతున్నట్టుగా అన్నాడు రమణ. కాదనలేక ఒక పాట పాడింది వనిత.

"చాల బాగా పాడావు వనితా! నీ ముందు సినిమా వాళ్ళు కూడా తీసికట్టే" తన్మయత్వంగా అన్నాడు.

"పాటలు వినందె మీకు నిద్ర పట్టదన్నారు. మీ దగ్గర అన్ని సినిమాల రికార్డ్సు వున్నాయా" తాను ఉత్సాహంగా అడిగింది. ఒక్కటి కూడా లేదన్నాడు రమణ. ఆశ్చర్యంగా చూసింది వనిత.

"ప్రక్క బిల్డింగ్‌లో ఆడపిల్లలున్నారుగా రోజు కొంకళ్ళను పిలిపించుకుని గదిలో కూర్చోబెట్టుకుని పాటలు పాడమంటాను. వాళ్ళు పాడే పాటలు వింటూ అలా... అలా... హాయిగా..." చెప్పుకు పోతూనే వున్నాడు రమణ. భద్రకాళిలా లేచింది వనిత. ఆమె మూడే గమనించకుండా బండిని లాగించేస్తున్నాడు రమణ. అంతె అతని చెంప



చెళ్ళుమంది. ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చేశాడు. అప్పటికి కాని అతనికి తాను చేసిన తప్పు అర్థం కాలేదు.

"నీకు ఆడపిల్లలంటే భయమా?... మోసగాడా... నీకు నాకు చెల్లు" అంటూ విసురుగా వెళ్ళపోయింది వనిత. వెంటబడి తలుపుదగ్గర పట్టుకున్నాడు రమణ.

"అయ్యో... నేను చెప్పేది విను. మా ప్రక్క బిల్డింగ్‌లో పాటలు నేర్పే స్కూలుంది. ఇదిగో ఇంతింత పిల్లలుంటారు" అంటూ తన మోకాలు వరకు చూపించి, "పదేళ్ళ వయసుం టుంది" అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు రమణ. విషయం అర్థమయిన వనిత సిగ్గుతో ఇక అతన్ని చెప్పనివ్వలేదు. చాటునుండి పొంచి వింటున్న నాకు ఇకపై వినపడలేదు. అందుకే వ్రాయడం ఆపేస్తున్నాను.



## దొంగ?

పది రూపాయిలు దొంగిలించాడన్న అనుమానం మీద ఆ హోటల్‌లోకి కొత్తగా చేరిన ఓ సప్లయర్‌ని పోలీసులకు అప్పగించారు. అతని గత చరిత్రను వెలికితీశాడు ఓ కుర్ర ఎస్.ఐ.

"హోటల్‌లో చేరకముందు ఏం చేసేవాడివి?"

"పిక్ పాకెట్ సార్!"

"అంతకుముందు?"

"ఇళ్ళకి కన్నాలు వేయడం! డబ్బు, బంగారం కాజేయడం!"

"అలాగా! అంతకంటే ముందు?"

"బ్యాంకు దోపిడీ! ట్రెజరీ డబ్బులు కొట్టేయడం!"

"ఆర్నీ లం... కొడకా! అంతకంటే ముందేం చేసేవాడివి? చెప్పరా! ఎముక లిరగ తంతాను!"

"బొంబాయిలో స్మగ్లింగ్ బోట్‌లో వుండి కోట్ల కొలది బంగారం వ్యాపారం సాగించేవాణ్ణి!"

"అంతకంటే ముందేం చేసేవాడివిరా?"

"పంజాబులో వుండేవాణ్ణండీ! మా లీడరు ఇచ్చిన హిట్ లిస్ట్‌లో వున్నవాళ్ళని వెదకి పిస్తోలుతో కాల్చి చంపడం! మీలాంటి ఓ పన్నెండు మంది ఎస్.ఐ.లను కాల్చి చంపేశాను!"

ఆ కుర్ర ఎస్.ఐ. మూర్ఛపోయాడు.

సప్లయర్ చెప్పుకుంటూ పోతున్నాడు.

"కాకపోతే ఏమిటండీ? ఎం.ఎ. ఫస్ట్ క్లాస్‌లో పాసయి కూడా ఉద్యోగం దొరక్క ఈ హోటల్‌లో సప్లయర్‌గా చేరితే పది రూపాయిలు కేవలం పది రూపాయిల దొంగతనం మీద అరెస్టు చేయిస్తారా?"

"సార్! సార్! ఏమయిందండీ... సార్"

కుర్ర ఎస్.ఐ. మరి లేవలేదు. *

—ఎ.ఎస్. రమేష్